PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి :



# సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాం...

- నారాయణపురం సర్పంచ్ యమున సుమన్ నాయక్....
- రైతులకు పట్టాలిచ్చి రైతుల కళ్లలో ఆనందం నింపిన తెలంగాణ ప్రభుత్వం....



**కేసముద్రం ఆగస్టు 30(ప్రభాత గమనం):**
నారాయణపురం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని నారాయణపురం గ్రామ సర్పంచ్ యమున సుమన్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వం చేపట్టిన ఈ పట్టాల పంపిణీ కార్యక్రమం వల్ల ఎన్నో ఏళ్లుగా హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతు కుటుంబాలకు నిజమైన భరోసా లభించిందని ఆమె తెలిపారు.?పట్టాలు చేతికి అందుతుండటంతో రైతు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొందని, రైతుల కళ్లలో వెల్లివిరుస్తున్న ఆనందమే ప్రభుత్వ పరిపాలనకు నిదర్శనమని అన్నారు.నిరుపేద రైతుల నిరీక్షణకు తెరదించి, భూములకు చట్టబద్ధమైన హక్కులు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టాలు రావడం ద్వారా రైతులకు భవిష్యత్తులో అందే ప్రభుత్వ పథకాలు, రుణ వసతులతో ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతులకు పట్టాలు రావడానికి కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, ఎంపీ వేం నరేందర్ రెడ్డికి,స్థానిక ఎంపీ బలరాం నాయక్ కు, ఎమ్మెల్యే ?మురళి నాయక్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన రైతులందరికీ 'పి.ఎం. కిసాన్' అందించాలి...

- కేసముద్రంలో నిరసన ధర్నా



**కేసముద్రం,ఆగస్టు 30 (ప్రభాత గమనం):**

కేసముద్రం పురపాలక సంఘం పరిధిలోని ఎన్టీఆర్ కూడలి వద్ద మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా (యునైటెడ్), ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారులకు నిబంధనల పేరుతో అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1, 2019 నాటికి భూమి పట్టా కలిగిన రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమ చేస్తున్నారని, ఆ తేదీ తర్వాత భూమి పట్టాలు పొందిన రైతులకు ఈ పథకం వర్తించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం 2026 సంవత్సరం వరకు భూమి పట్టా కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతును అర్హుడిగా గుర్తించి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు తక్షణమే ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో దశలవారీగా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్మోహనాచారి, 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గంద్రకోటి యాకయ్య, బోలకొండ సూరయ్య, అనుమాల రమేష్‌లతో పాటు కార్మిక సంఘం నాయకులు కిష్టయ్య, ఎన్. వెంకన్న, మల్లయ్య, పోతరాజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భారతమ్మ పార్థివ దేహానికి సమ్మిగౌడ్ నివాళులు....



**కేసముద్రం ఆగస్టు 30(ప్రభాత గమనం):**
కేసముద్రం మున్సిపాలిటీ ఒకటో వార్డు లక్ష్మీ నగర్ కాలనీలో గుండెపోటుతో మృతి చెందిన కొండపల్లి భారతమ్మ పార్థివదేహానికి ప్రముఖ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన భారతమ్మ కుమారులు కొండపల్లి వేణుగోపాల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి లతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన తీవ్ర సానుభూతిని తెలియజేశారు.అనంతరం సమ్మిగౌడ్ మాట్లాడుతూ... భారతమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆ మహనీయురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కాలనీవాసులు, బంధుమిత్రులు పాల్గొని నివాళులర్పించారు.

# సెప్టెంబర్ రెండు నుంచి వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బిఆర్ఎస్ నిరసనలు....

- మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ పిలుపు
- వారం రోజులు దశలవారి కార్యక్రమాలు...
- కాంగ్రెస్ ది అభయ హస్తం కాదు బస్మాసుర హస్తం...



**మహబూబాబాద్ ఆగస్టు 30(ప్రభాత గమనం):**
1000 రోజుల కాంగ్రెస్ పాలనపై, 6 గ్యారంటీలు, డిక్లరేషన్లపై తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పాలనపై సెప్టెంబర్ 2 నుంచి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు, యువత, మహిళలు, రైతుసోదరులు పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహబూబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెసు ది అభయ హస్తం కాదని భస్మాసుర హస్తమని, ఎన్నికల ముందు 2023లో తుక్కుగూడ సభలో సోనియా గాంధీ 6 గ్యారంటీలు, డిక్లరేషన్ లపై వంద రోజుల్లో అమలు చేస్తామని, మొదటి క్యాబినెట్ లోనే చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి 1000 రోజులు పాలన పూర్తయినా నేటి వరకు హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి పై తులం బంగారం ఇస్తామని మోసం, 500 కే గ్యాస్ పై మోసం, రైతు భరోసాలో ద్రోహం, రెండు లక్షల రుణమాఫీ 40% కూడా పూర్తి కాలేదని, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ లపై మోసం, ఉద్యోగులకు పిఆర్సి, 317 జీవో పై రద్దు, 6డిఏ ల పై మోసం, గృహ జ్యోతి 200ల యూనిట్లు పై మోసం, పూర్తికాని ఇందిరమ్మ ఇండ్లు ఇలా ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారులకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలు తిరుగుబాటు ఎగరేయాలని అని పిలుపునిచ్చారు. ప్రతి మండల కేంద్రంలో ఈ నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని వారం రోజులపాటు వివిధ దశల్లో జరిగే ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా రెండున తాసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లా ఆసుపత్రి వరకు దారి పొడవునా పెద్ద బ్యానర్ తో కాంగ్రెస్ మోసం చేసిన హామీలను బ్యానర్ పై వివరిస్తూ ర్యాలీ ఉంటుందని కార్యకర్తలు సైనికుల్లా పనిచేసే కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించడంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే కేసముద్రం మండలం నారాయణపురంలో గతంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇచ్చిన పాసుబుక్కులను నేడు కాంగ్రెస్ మంత్రి రైతులకు ఇవ్వడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు యాకూబ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎమ్ డి ఫరీద్, మాజీ జడ్పిటిసి కాశీం, తేళ్ల శ్రీను, ఆవుల వెంకన్న, రంజిత్ అశోక్, మహేందర్ రెడ్డి, నజీర్, శేఖర్, నరేష్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక


# పట్టువదలని విక్రమార్కుడు రవినాయక్...




- నారాయణపురంలో ఫలించిన దశాబ్దాల పోరాటం...
- మంత్రి చేతుల మీదగా అందుకోనున్న భూహక్కు పట్టాలు...
- రైతుల పక్షాన నిలిచి గెలిచిన ధరావత్ రవినాయక్...
- గ్రామంలో మిన్నంటిన సంబరాలు, కన్నీటి పర్యంతమైన బాధితులు....

**కేసముద్రం ఆగస్టు 30 (ప్రభాత గమనం):**

తరతరాలుగా సాగు చేసుకుంటున్నా భూమిపై హక్కులేక, అధికారుల చుట్టూ తిరిగీ వేసారిన నారాయణపురం రైతుల దశాబ్దాల కల నెరవేరింది. నమ్ముకున్న నిలయానికి, చెమటోడ్చిన మడికి ఎట్టకేలకు చట్టబద్ధమైన గుర్తింపు లభించింది.ఆనాడు పట్టువదలని విక్రమార్కుడిలా ధృడ సంకల్పంతో రైతుల తరఫున నిలబడి, యంత్రాంగంతో పోరాడిన స్థానిక నాయకుడు నారాయణ పురం మాజీ ఎంపీటీసి ధరావత్ రవినాయక్ నిరంతర కృషి ఫలితంగా నేడు భూ బాధితుల చేతుల్లోకి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులు అందుకోనున్నారు.కేసముద్రం మండలం నారాయణపురం వ్యవసాయ భూముల సమస్య దశాబ్దాలుగా నంజూరిపోయింది. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా రైతుల కష్టాలు మాత్రం తీరలేదు. ఈ క్రమంలో ఆనాడు అధికార పార్టీ ఎంపీటీసి గా ధరావత్ రవినాయక్ పట్టాలు వచ్చే వరకు నేను పోరుడుతా అని రైతులకు అండగా నిలిచారు.ఎన్ని అడ్డంకులు వచ్చిన అవరోధాలు వచ్చిన సమస్య తేలేవరకు విశ్రమించేది లేదని భీష్మించుక కూర్చున్నారు. అధికారులతో సమీక్షలు, రెవెన్యూ రికార్డుల పరిశీలన, చట్టపరమైన చిక్కులను విప్పడంలో కీలక భూమిక పోషించారు. ఎన్ని పరిపాలనాపరమైన ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా దరఖాస్తుల స్థాయి నుంచి పట్టాల పంపిణీ వరకు ప్రతి అడుగులోనూ ముందుండి నడిపించారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వెళ్లేలా రవినాయక్ శ్రమించారు. ఆనాడు మంత్రుల సహకారం లేకున్నా హైదరాబాద్ లో అనేక సార్లు రోడ్డు పై ధర్నాలు నిర్వహించారు.ఆయన పడ్డ శ్రమనే నేడు రైతులకు హక్కు పత్రాలు సిద్ధించపోతున్నాయి.నేడు జరగబోవు మంత్రుల ప్రత్యేక కార్యక్రమంలో అర్హులైన రైతులకు పట్టాలు అందజేస్తారని గ్రామంలో పండగ వాతావరణం సంతరించుకుంది. సొంత భూమికి చట్టబద్ధమైన హక్కు పత్రాలు చేతికి దక్కుతుండటంతో రైతులు ఆనందభాష్పాలు రాల్చారు."ఈ భూములు మాకు దక్కుతాయని ఆశలే వదిలేసుకున్నాం.కానీ రవినాయక్ అన్న మా మాటను తన మాటగా భావించి రేయింబవళ్లు శ్రమించారు. మా తరతరాల చిరికాల కల నెరవేర్చిన ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం," అని పలువురు వృద్ధ రైతులు భావోద్వేగానికి లోనయ్యారు.పట్టాల పంపిణీ అనంతరం గ్రామస్తులు, రైతులు రవినాయక్‌కు ఘనంగా నీరాజనాలు పలికారు. మహిళలు మంగళహారతులతో, పూలమాలలతో స్వాగతం పలికి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. మాట ఇచ్చి తప్పే నేటి రాజకీయాల్లో, ప్రజల కష్టాన్ని తనదిగా భావించి పరిష్కరించిన రవినాయక్ నిజమైన 'నారాయణపురం కథానాయకుడు' అని స్థానికులు కొనియాడారు.





